సాక్షి
రంగారెడ్డి

శనివారం । 18 । అక్టోబర్ । 2025



సామాజిక తెలంగాణే లక్ష్యం

సామాజిక తెలంగాణ సాధనే జాగృతి లక్ష్యమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. 10లో▸



పట్టుదల ఉంటే..

కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. 10లో▸



రిజర్వేషన్లు సాధించే వరకు

రిజర్వేషన్ల సాధనే తమ లక్ష్యమని, అమలు చేసేవరకు పోరాడతామని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

విధుల్లో అలసత్వం వద్దు



టీకాల కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ తదితరులు

శంకర్‌పల్లి: విధుల్లో అలసత్వం వహించకుండా, ప్రభుత్వం సూచించిన పనులను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ అన్నారు. మండలంలోని కొండకల్, మహారాజ్‌పేట్, దొంతాన్‌పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పశువులకు వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన వైద్యం అందించాలన్నారు. పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహారాజ్‌పేట్ పశువైద్యురాలు డాక్టర్ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

హయత్‌నగర్: మానవుడు తన అవసరాలకు సహజ వనరులను విధ్వంసం చేస్తున్నాడని, ప్రకృతి సహజత్వాన్ని కాపాడి భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ పర్యావరణవేత్త పాలడుగు జ్ఞానేశ్వర్ అన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవులను కొల్లగొటి, సహజ నీటి వనరులను కలుషితం చేయడంతో మంచినీటిని కొనుక్కునే పరిస్థితి వచ్చిందని అన్నారు. భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సిన దుస్థితి రావచ్చన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి వృక్ష సంబంధమైన వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, నక్క శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఆక్రమణల తొలగింపు

హయత్‌నగర్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తొర్రూర్ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 383లోని ప్రభుత్వ భూమిలో కొంత కాలంగా అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ ప్రేమ్ ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీల సాయంతో వాటిని కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు.

విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట



కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న చారకొండ వెంకటేశ్

కడ్తాల్: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి విద్యా ప్రగతి, సౌకర్యాలను తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బోధనా విధానాలు, హాజరు, పాఠ్య ప్రణాళిక అమలు, విద్యార్థుల వ్యక్తిగత దృష్టి, నైపుణ్యాభివృద్ధిపై సమీక్షించారు. ఉపాధ్యాయుల కృషి, నిబద్ధతను ప్రశంసిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, పాఠశాల ఎస్ఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లే అడ్డా!

గుట్టుగా రేవ్, ముజ్రా పార్టీలు

- మందేసి, చిందేస్తున్న యువతీయువకులు
- అశ్లీల, అసాంఘిక కార్యకలాపాలు
- వీకెండ్ వచ్చిందంటే యథేచ్ఛగా జల్సా
- తరచూ పట్టుబడుతున్న డ్రగ్స్, గంజాయి, విదేశీ మద్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆహ్లాదాన్ని.. మనసుకు ఆనందాన్ని పంచాల్సిన విలాసవంతమైన ఫాంహౌస్‌లు.. అశ్లీలత, అసాంఘిక శక్తులకు అడ్డలుగా మారిపోతున్నాయి. రాత్రి అయ్యిందంటే చాలు మిరమిట్లు గొలిపే లైటింగ్స్ విరజిమ్ముతున్నాయి. డీజే సౌండ్, అర్ధరాత్రి అందమైన భామల నృత్యాలతో హోరెత్తిపోతున్నాయి. ప్రమాదకరమైన కొకై న్, హెరాయిన్ వంటి డ్రగ్స్, గంజాయి, హుక్కా, ఖరీదైన విదేశీ మద్యం మత్తులో తేలియాడుతున్నాయి. పోలీసుల తనిఖీల్లో తరచూ రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులు, వారి పిల్లలు పట్టుబడుతుండడం గమనార్హం. పోలీసులు తరచూ దాడులు చేస్తున్నా నిర్వాహకులు మాత్రం తమ ధోరణి మార్చుకోవడం లేదు.

వీకెండ్ పార్టీలు.. డ్రగ్స్ అమ్మకాలు

నగరానికి ఆనుకుని ఉన్న మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, మంచాల, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాల్లో రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు భారీగా భూములు కొనుగోలు చేశారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ఎగువ ప్రాంతాల్లో పచ్చని చెట్లు, ప్రకృతి అందాలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా ఫాంహౌస్‌లు ఉండగా, జంటజలాశయాల చుట్టు పక్కనే 700పైగా ఉన్నట్లు అంచనా. 111 జీఓ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతి లేకపోవడంతో ధనవంతులు తమ వ్యవసాయ భూముల్లో విలాసవంతమైన క్లబ్బులు, రిసార్టులు ఏర్పాటు చేశారు. వీరిలో కొంతమంది వివాహ రిసెప్షన్లు, బర్త్‌డే వేడుకలు, వీకెండ్ పార్టీలకు అద్దెకిచ్చి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. వీకెండ్ వచ్చిందంటే చాలు రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన పిల్లలు ఇక్కడ వాలిపోతుంటారు. బర్త్‌డేలు, ఇతర పార్టీల పేరుతో అర్ధరాత్రి వరకు అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేస్తూ మద్యం సేవిస్తుంటారు. స్వదేశీ మద్యానికి అనుమతి తీసుకుని గుట్టుగా విదేశీ మద్యాన్ని సేవిస్తున్నారు. ప్రమాదకరమైన డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వీటి చుట్టే గంజాయి, డ్రగ్ పెడ్లర్స్ కూడా మాటు వేసి కూర్చొని ఉండటం, హత్యలు, అత్యాచారాలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

గేట్లు తట్టాలంటే పోలీసులకు వణుకే..

తమ ఫాంహౌసుల్లోకి ఎక్సైజ్, సివిల్ పోలీసులు తనిఖీలకు రాకుండా నిర్వాహకులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. కొంతమంది ప్రధాన గేటు, మెయిన్ డోరును రిమోట్‌తో ఆపరేట్ చేస్తున్నారు. ఇతరులు ప్రయత్నించినా తెరుచుకోకుండా ఖరీదైన తాళాలు బిగిస్తున్నారు. ఫాంహౌస్‌కు వచ్చివెళ్లే ప్రధాన రహదారి సహా దాని చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని తనిఖీ కోసం లోనికి వచ్చేందుకు యత్నించే పోలీసులను గేటు బయటే అడ్డుకుంటున్నారు. ప్రముఖ నేతలతో ఉన్నతాధికారులకు ఫోన్లు చేయించి, వచ్చిన వాళ్లను వెనక్కి పంపుతున్నారు. వికారాబాద్–చేవెళ్ల సరిహద్దులోని ఓ రిటైర్డ్ పోలీసు ఆఫీసర్‌కు చెందిన ఫాంహౌస్ సహా మొయినాబాద్ శివారు కేంద్రంగా వెలసిన ఓ రాజకీయ ప్రముఖుడి ఫాంహౌస్‌లు ఇందుకు నిత్య వేదికలుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి తలుపు తట్టేందుకు ఎక్సైజ్, ఎస్ఓటీ పోలీసులు జంకుతుండటం గమనార్హం. గేట్లు దూకి బలవంతంగా లోపలికి వెళ్లిన పోలీసులపై వేట కుక్కలను వదులుతున్నట్లు తెలిసింది. పార్టీకి వచ్చిన అమ్మాయిలతో మిస్ బిహేవ్ చేశారని, డబ్బులు డిమాండ్ చేశారని, తనిఖీలకు వెళ్లిన బృందాలపై ఉల్టా ఫిర్యాదు చేయిస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లేందుకు పోలీసులు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి సమయంలో తనిఖీ బృందాలకు అండగా నిలవాల్సిన ఉన్నతాధికారులు సైతం అందరి ముందే వాళ్లను నిలదీసి, కనీస వివరణ కూడా తీసుకోకుండా షోకాజ్ నోటీసులు జారీ చేస్తుండడం విశేషం.

రెండు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు

ఏపీకి చెందిన ఓ ప్రముఖ ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ కంపెనీ తమ డీలర్ల కోసం మంగళవారం మహేశ్వరం మండలం ఘట్టుపల్లి శివారులోని కె.చంద్రారెడ్డి (కేసీఆర్) రిసార్ట్‌లో ముజ్రా పార్టీ ఏర్పాటు చేసింది. ఎక్సైజ్‌శాఖ నుంచి మద్యం సరఫరాకు అనుమతి తీసుకుని అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయించింది. డయల్ 100కు కాల్ రావడంతో పోలీసులు రిసార్ట్స్‌పై దాడి చేసి 52 మంది డీలర్లు, 22 మంది అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు. తాజాగా బుధవారం రాత్రి మంచాల మండలం లింగంపల్లిలోని సప్తగిరి ఫాంహౌస్‌లో రేవ్‌పార్టీపై పోలీసులు దాడి చేసి అశ్లీల నృత్యాలు చేస్తున్న ఎనిమిది మంది మహిళలు సహా 25 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. ఈ పార్టీలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉండడం గమనార్హం.

మొయినాబాద్‌లో మచ్చుకు కొన్ని ..

- బాకారం రెవెన్యూ పరిధిలోని ఎస్‌కే నేచర్ రీట్రీట్ ఫాంహౌస్‌లో నెల రోజుల క్రితం నిర్వహించిన ఓ బర్త్‌డే పార్టీలో హుక్కా, విదేశీ మద్యం వినియోగించిన 51 మంది విదేశీలను అరెస్ట్ చేశారు. వీరిలో 36 మంది వీసా గడువు ముగిసినట్లు గుర్తించారు.
- నాలుగు నెలల క్రితం ఎత్‌బార్‌పల్లిలోని ఫాంహౌస్‌లో బర్త్‌డే పార్టీ పేరుతో నిర్వహించిన ముజ్రాపార్టీపై పోలీసులు దాడి చేసి 13 మంది యువకులు, ఏడుగురు యువతులు సహా గంజాయి, హుక్కా, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- తోలుకట్ట రెవెన్యూ పరిధిలో ఓ ఎమ్మెల్సీకి చెందిన ఫాంహౌస్‌లో కోడి పందేలు ఆడుతుండగా ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి భారీగా మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఆరు నెలల క్రితం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడిచేసి, పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు.
- కనకమామిడి సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ముగ్గురు మహిళలను అరెస్ట్ చేశారు.
- నజీబ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో ముజ్రాపార్టీ నిర్వహిస్తుండగా ఆరుగురు యువకులు, నలుగురు యువతులను అరెస్ట్ చేశారు.

పారదర్శకంగా డీసీసీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాబర్ట్‌బ్రూస్

ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్

ఆమనగల్లు: రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక అభిప్రాయ సేకరణ కోసం బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నాయకుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాబర్ట్ బ్రూస్ మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు చోరీ ద్వారా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్య యుతంగా చేపడుతున్నట్లు చెప్పారు. సమర్థత, క్రమశిక్షణ, నిబద్ధత, పార్టీకోసం పనిచేసేవారికే అధ్యక్ష పదవి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉంటుందని, రేవంత్ రెడ్డి సీఎంగా కొనసాగుతారని అన్నారు. సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు శివసుబ్రహ్మణ్యం, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ యాటగీత, బంజార రాష్ట్ర నాయకురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీకి అయిల శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తు

డీసీసీ అధ్యక్ష పదవికి కడ్తాల మండలం మైసిగండికి చెందిన టీపీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. మండల కేంద్రానికి శుక్రవారం వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీయూఎస్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని దరఖాస్తు అందించారు. మూడు దశాబ్దాలుగా పార్టీకి సేవలు అందిస్తున్నానని తెలిపారు. తనకు అవకాశం కల్పించాలని కోరారు.

సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి

గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు



కలెక్టరేట్‌లో సమావేశమైన కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరలో పూర్తి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఇంటి అద్దె భృతి 24 శాతానికి పెంచాలని, త్వరలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టాలని తీర్మానించినట్లు చెప్పారు. పీఆర్‌సీ ప్రకటించి అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సంఘం భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో పర్యటించి హౌసింగ్ సొసైటీ సభ్యులను చేర్పించాలని సూచించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేశ్, సహ అధ్యక్షులు నూతనకంటి వెంకట్, అలివేలు, బాలరాజుగౌడ్, జాయింట్ సెక్రటరీలు నాగేశ్వర్‌రావు, మహేశ్వరి, సైదమ్మ, శాంతిశ్రీ, మసూద్ అలీ పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఫాంహౌస్, రిసోర్ట్స్‌ల్లో నిర్వహించే ఫంక్షన్లకు తప్పనిసరి అనుమతులు తీసుకోవాలని డీసీపీ సునితారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఫాంహౌస్, రిసార్ట్స్ యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలకు, చట్టానికి వ్యతిరేకంగా ముజ్రా, రేవ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వీకేండ్ పార్టీల్లో మద్యం, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలను వినియోగించకుండా చూడాలన్నారు. ఇకపై ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌పై నిఘా ఉంటుందని, సమీప పోలీస్‌స్టేషన్లకు ఎలాంటి ఫంక్షన్లు నిర్వహిస్తున్నారో సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో మహేశ్వరం, మంచాల పోలీస్‌స్టేషన్ పరిధుల్లో చోటుచేసుకున్న సంఘటనలపై చర్చించారు. ఫాంహౌస్, రిసార్ట్స్ యజమానులకు మార్గదర్శకాలను జారీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, రవికుమార్, నందీశ్వర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ప్రధాన రోడ్డును ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం పరిశీలించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆకోపస్ మీదుగా సుమారు రూ.60 కోట్ల హెచ్ఆర్‌డీసీఎల్ నిధులతో విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్డు విస్తరణలో ప్రజలు నష్టపోకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలి, నష్టపోయే వారిని ఎలా ఆదుకోవాలి తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా ఉన్నవారికి నష్టం వాటిల్లకుండా అధికారులు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. తప్పని పరిస్థితుల్లో నష్టపోతే స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనుల మ్యాప్‌ను ఆర్అండ్ బీ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో రోడ్డు విస్తరణ, ప్రభుత్వాస్పత్రి నూతన భవన నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సునితారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిని సస్యశ్యామలం చేస్తాం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కల్వకుర్తి నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేఎల్ఐ డీ82 కాలువ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాల పరిధిలోని 35వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో శుక్రవారం కేఎల్ఐ డీ82 కాలువ భూనిర్వాసితులకు ప్రభుత్వం ద్వారా రెండో విడత మంజూరైన రూ.2.50 కోట్ల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధి, సాగునీటి కల్పనకు పెద్దపీట వేస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి నిర్ణీత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. కేఎల్ఐ డీ 82 కాలువ భూ నిర్వాసితులకు పరిహారం అందించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక పరిహారం డబ్బులు విడుదల చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ, టీపీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ అధికారులు ఏఎస్ఎన్‌రెడ్డి, శ్రీకాంత్, దేవన్న, తిరుపతయ్య, తహసీల్దార్ ఫయీంఖాద్రి, సీఐ జానకీరాంరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లలితాదేవి

తుక్కుగూడ: ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఎవరైనా విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్కకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

మొయినాబాద్: వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేబర్ రూం, ఫార్మసీ స్టోర్, ల్యాబ్ రూంలను పరిశీలించారు. గర్భిణుల స్కానింగ్‌లో గ్రోథింగ్ ఎలా ఉంది.. ఫార్మసీ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా.. ల్యాబ్‌లో ఎలాంటి వైద్య పరీక్షలు చేస్తున్నారనే విషయాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్ఓ వెంకట్‌రెడ్డితో మాట్లాడి ఆస్పత్రి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్య ఏమిటో తెలుసుకుని సరైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శంకర్‌పల్లి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

శంకర్‌పల్లి: వైద్య సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరు కావడంపై జిల్లా వైద్యాధికారి లలితాదేవి అసహనం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సకాలంలో హాజరు కాని వైద్యాధికారి రేవతిరెడ్డి, సీహెచ్ఓ స్వామి, ఫార్మసిస్టు నీరజ, స్టాఫ్ నర్సు అనిత, సూపర్‌వైజర్ అగ్నేస్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, హాజరు పట్టికలో సెలవులో ఉన్నట్లు సంతకం చేశారు. పీహెచ్‌సీ లోపల, బయట పారిశుద్ధ నిర్వహణ సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రామలింగేశ్వర ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అభివృద్ధి పనుల ప్రారంభం

మంచాల: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఎల్లమ్మ తండాలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు, బోడకొండ గ్రామంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు, మంచాలలో రూ.40 లక్షలతో అండర్ డ్రైనేజీ, ఆరుట్లలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు, ఆరుట్లలోని బుగ్గరామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.కోటి ఐదు లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, మరో రూ.5 లక్షలతో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఏసీపీ కేపీవీ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కంభాలపల్లి గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, జయమ్మ, మల్లేశ్, పాండు, ఎల్లేష్, ప్రేమాకర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న కుర్మసంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీరప్పగుడి స్థలాన్ని కాపాడాలని కుర్మ సంఘం ఆదిబట్ల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలయ భూమిలో ఆ సంఘం నాయకులు గుంతలు తవ్వగా.. వాటిని పోలీసుల సహకారంతో ప్లాట్ల యజమానులు కూల్చివేశారని ఆరోపిస్తూ.. వారితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడారు. ప్రైవేటు స్థలంపై హైడ్రాకు, పోలీసులకు ఏంపనని ప్రశ్నించారు. చెరువులు, కుంటలు, అక్రమ నిర్మాణాలను వదిలేసి, పట్టా భూమి జోలికి ఎందుకు వస్తున్నారని మండిపడ్డారు. స్టే ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు ఉందని పేర్కొంటూ.. గతంలో హైడ్రా.. గుడి ప్రహరిని కుల్చీవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ తగాదాలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఠాణాకు వెళ్లి, భూమి జోలికి రావొద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, సంఘం నాయకులు జంగయ్య, రాజు, శివకుమార్, శ్రీనివాస్, వెంకటేశ్, రవి, నర్సింహ, భాస్కర్ పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయండి



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేత

ఆమనగల్లు: ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుజ్జల మహేశ్, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ అలీలు డీజీపీ బి.శివధర్‌రెడ్డిని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. శుక్రవారం ఇరువురు నగరంలోని డీజీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆటో ఢీ, ఒకరి మృతి



ఘటనా స్థలంలో శంకర్ మృతదేహం

శంకర్‌పల్లి: ఆటో ఢీ కొన్న ప్రమాదంలో పాద చారి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మోకిల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్జాగూడకు చెందిన శంకర్ సింగ్(48) అవివాహితుడు. తల్లిదండ్రులు మరణించడంతో అన్న ఇంట్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సదరు వ్యక్తి.. మిర్జాగూడ గేట్ నుంచి హైదరాబాద్ వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో శంకర్‌పల్లి నుంచి నగరం వైపు వెళ్తున్న ఆటో.. శంకర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆయన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నో సేఫ్టీ..!

రిసార్ట్స్‌లో పర్యాటకులకు రక్షణ కరువు



సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బోటింగ్

- అనుమతులు లేకుండానే బోటింగ్
- తరచూ మునిగిపోతున్న పడవలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ఇటీవల ఇద్దరి మృత్యువాత
- చోద్యం చూస్తున్న ఆయా శాఖలు

వికారాబాద్: జిల్లాలో అనుమతులు లేని రిసార్ట్స్ విచ్చలవడిగా పుట్టుకొస్తున్నాయి. వీటిలో పర్యాటకుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాలం చెల్లిన బోట్లలో పర్యాటకులను ప్రాజెక్టుల్లోకి తీసుకెళ్లి ప్రమాదాల బారిన పడేస్తున్నారు. ఇటీవల కాలంలో బోట్లు తిరగబడి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే.. అయినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. వికారాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ రిసార్ట్స్ నిర్వాహకులు బోటింగ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల బోటు తిరగబడి ఇద్దరు పర్యాటకులు మృతి చెందిన విషయం తెలిసిందే. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సంబంధిత శాఖల అధికారులపై తీవ్ర విమర్శలు రావడంతో రిసార్ట్స్‌ను మూసి వేశారు. ఆ వెంటనే రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలతో విచారణ కమిటీ వేశారు. కమిటీ అక్కడ పర్యటించి నివేదిక కూడా ఇచ్చింది. కానీ అందులోని అంశాలను బయట పెట్టలేదు. అనుమతులు లేకపోవటంతో పాటు రిసార్ట్స్ నిర్వాహకుల తప్పిదం వల్లే పర్యాటకుల ప్రాణాలు గాల్లో కలిసినట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. కమిటీ నివేదిక సమర్పించి నెలలు కావస్తున్నా నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓ ఘటన జరిగిన రెండు నెలల తర్వాత ఇద్దరిని రిమాండ్ చేయగా ఆ వెంటనే బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అసైన్డ్ భూమిలో, ప్రాజెక్టు బఫర్ జోన్‌లో, పశువుల తాగునీటి పానాదిలో నిర్మాణాలు వెలసాయి. అయినా రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

వరుస ఘటనలతో బెంబేలు

రిసార్ట్స్ నిర్వాహకులు సమీప ప్రాజెక్టుల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే బోటింగ్ నిర్వహిస్తున్నారు. కాలం చెల్లిన పడవలు కావడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అందులో వెళ్లే పర్యాటకులకు సేఫ్టీ మెజర్ మెంట్స్ ఇవ్వకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల వికారాబా ద్ సమీపంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో ఇద్దరు పర్యాటకులు మృతి చెందారు. మునిగిపోతున్న మరో ఇద్దరిని స్థానికులు కాపాడారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఇది మూడో ప్రమాదం. ఇక్కడి ఓ రిసార్ట్స్‌లో గతంలో అడ్వెంచర్ గేమ్స్ ఆడుతూ బావిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇటీవల ఇద్దరు పర్యాటకుల మృతికి కారణమైన రిసార్ట్స్‌లోనే అడ్వెంచర్ గేమ్‌లో భాగంగా కారు నడుపుతూ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే రిసార్ట్స్‌ల ఏర్పాటుకు 11 రకాల అనుమతులు అవసరం ఉండగా అందులో ఏ ఒక్కటి కూడా తీసుకోవడం లేదు. కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసరాలు, ఆ ప్రాజెక్టుల బఫర్ జోన్లు పూర్తిగా ఈ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు.

చేయి తడిపితే సక్రమం

జిల్లాలోని కొంత మంది అధికారులు రిసార్ట్స్ నిర్వాహకులకు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మామూళ్లు ఇవ్వకుంటే అక్రమం.. చేయి తడిపితే సక్రమం అనే ధోరణి అవలంబిస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతగిరి ఫారెస్టుకు అనుకొని అక్రమంగా ఏర్పాటు చేసిన రిసార్ట్స్ విషయంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఎలాంటి అనుమతులు లేవని మూసి వేశారు. నెల తిరక్కుండానే మళ్లీ ఓపెన్ చేశారు. ఏడాది క్రితం కూడా ఇలాగే జరిగింది. కానీ అధికారులు పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలతో ఈ రిసార్ట్స్ ఏర్పాటు చేయగా ఇప్పుడు కూడా దాని నిర్వహణకు ఓ ప్రజాప్రతినిధి సహకరిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఇందులో బోటింగ్, నైట్ క్యాంపింగ్, పలు రకాల అడ్వెంచర్ గేమ్స్, గేమింగ్, హోటల్స్, రాత్రి బస చేసేందుకు గదుల ఏర్పాటు చేశారు. పేకాట, మద్యం సేవించడం వంటివి సాధరమైపోయాయి. ఒక్క రాత్రి బస చేసేందుకు అక్కడ కల్పించే సౌకర్యాలు, అడ్వెంచర్ గేమ్స్‌ను బట్టి ఒక్కో జంటకు రూ.3000 నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మహేశ్వరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్జీఓ నిరంతరం పని చేస్తుందని యూనియన్ జిల్లా హడహక్ కమిటీ కన్వీనర్ ముజీబ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్టీఓ, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన అలవెన్సులు, రాయితీలు ప్రతి ఉద్యోగికి అందే విధంగా చూస్తామని చెప్పారు. ఉద్యోగులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, వారికి రక్షణగా ఉంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, అశోక్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

మొయినాబాద్: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడుకుందామని 108 సిబ్బంది అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేసి, వారిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించుకుందామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పుడు ఎవరికి గుండెపోటు వస్తుందో తెలియని పరిస్థితని, అలాంటి అపాయం వస్తే.. సీపీఆర్ చేయాలని పేర్కొంటూ.. ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనంతరం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భూక్య శ్రీకాంత్, శ్యామప్ప, నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

అరకొర బస్సులు.. ప్రయాణికుల పాట్లు

విధిలేక ఒంటికాలిపై ఆడబిడ్డల పయనం



యాచారం- కందుకూరు రూట్ బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

యాచారం: మహాలక్ష్మి పథకం పేరిట ప్రభుత్వం.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కానీ అందుకు తగిన విధంగా సర్వీసుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగి.. అవస్థల నడుమ ఆడబిడ్డలు ఒంటికాలిపై పయనిస్తూ.. ఇబ్బంది పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పురుషులదీ అదే సమస్య. యాచారం- కందుకూరు రూట్లో సరిగా బస్సులు లేక.. అరకొర బస్సు ట్రిప్పులతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ రూట్లో ఉదయం, సాయంత్రం వేళలో రెండు మండలాల పరిధి గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులతో పాటు అనేక మంది యాచారం మండల కేంద్రం, ఇబ్రహీంపట్నం, నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు అధికంగా ఉన్నప్పటికీ.. సంస్థ అధికారులు సర్వీసులు, ట్రిప్పులు పెంచకపోవడంతో ప్రజలు నరక ప్రయాణం చేస్తున్నారు. ఫుట్‌బోర్డు ప్రయాణంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి.. ఈ మార్గంలో అదనపు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టుదల ఉంటే.. విజయాలు మీవెంటే

- లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి
- మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రవికుమార్



శిక్షణా కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో.. గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'స్వయం ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి' శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జీవిత గమనంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొన్నప్పుడే లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ.. వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చిన్నచిన్న విషయాలకు కుంగిపోకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే విజయతీరాలకు చేరుకుంటారని స్పష్టం చేశారు. లక్ష్య సాధనకు ప్రణాళికలను రూపొందించుకొని, నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ నీతాపోలె మాట్లాడుతూ.. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

- బీసీలంతా సంఘటితంగా ముందుకు సాగాలి
- సంఘం జేఏసీ నాయకులు



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

ఆమనగల్లు: రిజర్వేషన్ల సాధనే తమ లక్ష్యమని, స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా అమలు చేసేవరకు.. పోరాడతామని బీసీ జేఏసీ ఆమనగల్లు నాయకులు అన్నారు. అందుకు రాజకీయాలకు అతీతంగా బీసీలు సంఘటితంగా ముందుకు సాగాలని, రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని రాజకీయ శత్రువులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రిజర్వేషన్ల అమలుకు కార్యాచరణ, నేడు నిర్వహించే తెలంగాణ బంద్ విజయవంతంపై చర్చించారు. అనంతరం పలువురు మాట్లాడారు. పోరాటాలతోనే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతిని కాంక్షించి, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని, దానిని అడ్డుకున్న వారు ఎంతటివారైనా సహించేది లేదని స్పష్టం చేశారు. నేటి బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు అల్లాజీగౌడ్, శివలింగం, కేశవులు, బాలకృష్ణ, శ్రీను, జి.శ్రీను, దుర్గయ్య, ప్రసాద్, అప్పి, పరమేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్దతు

కడ్తాల్: రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్‌కు పూర్తిగా సహకరిస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేరాలను నియంత్రించండి



సీఐతో మాట్లాడుతున్న సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: పెట్రోలింగ్ ముమ్మరం చేసి, నేరాలను నియంత్రించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు.. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డికి సూచించారు. శుక్రవారం ఆయన పహాడీషరీఫ్ ఠాణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల పరిశీలనతో పాటు సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. కేసులు, దర్యాప్తు తదితర అంశాలపై ఆరా తీశారు. న్యాయం కోసం వచ్చే వారికి భరోసా కల్పించాలని చెప్పారు.

సామాజిక తెలంగాణే జాగృతి లక్ష్యం



తుక్కుగూడ: సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి నాయకులు

సంస్థ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి

తుక్కుగూడ: సామాజిక తెలంగాణ సాధనే జాగృతి లక్ష్యమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి జనయాత్ర చేపట్టనుందని తెలిపారు. యాత్ర మొదటగా ఈ నెల 25న నిజామాబాద్ నుంచి ప్రారంభమై, 33 జిల్లాలో కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, నరేష్, బండారి లావణ్య, ముస్తాఫ, రామకోటి, రాము యాదవ్, నవీన్‌గౌడ్, సందిప్, సత్యానారాయణ, బాబురావు, సాల్వాచారి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'జనంబాట'ను జయప్రదం చేద్దాం

కందుకూరు: సామాజిక తెలంగాణే జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత లక్ష్యమని, అందు కోసం ఈ నెల 25 నుంచి చేపట్టనున్న 'జనంబాట' కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని జాగృతి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని కార్యాలయంలో సంస్థ జిల్లా యాత్ర పర్యవేక్షకుడు శ్రీనివాస్, నరేష్, అర్చన సేతుపతి సమక్షంలో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రలో భాగంగా ఆదివాసి, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు బీసీ రిజర్వేషన్ల అమలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకై ఆమె పోరాటం చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.